ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 7 జనవరి 2024



వైసీపీ ప్రభుత్వంపై విసిగిపోయారు

- నాలుగు నెలల్లో జగన్ ప్రభుత్వానికి చరమగీతం
- మాజీ మంత్రి పరిటాల సునీత



అనంతపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వంపై విసిగిపోయారని, మరో నాలుగు నెలల్లో జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడి, అందరూ మెచ్చే టీడీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోనున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని, ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని అన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను బంధించి, బాధించిన ఏకైక ప్రభుత్వం వైసీపీదేనని అన్నారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు చేపట్టిన 'రా కదలిరా' సభలకు వస్తున్న జనవాహిని చూసి తాడేపల్లి ప్యాలెస్ పునాదులు కదిలిపోతున్నాయని అన్నారు. చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టడమే కాకుండా ఆయనపై వైసీపీ నాయకులు చేసిన దూషణలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. దళితులు, బీసీలు జగన్ పాలనలో అత్యధికంగా హింసకు గురయ్యారన్నారు. ఆ వర్గాలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేశారన్నారు. టీడీపీ తీసుకొచ్చిన మేనిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. మహిళలు, రైతులు, నిరుద్యోగ యువతకు మేనిఫెస్టోలో చంద్రబాబు పెద్ద పీట వేశారని, బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇవ్వడం ఆ వర్గాల్లో మరింత భరోసా నింపిందన్నారు. రాష్ట్రమంతా వైసీపీ వ్యతిరేక గాలి వీస్తోందని, రానున్న ఎన్నికల్లో వైసీపీ 175 సీట్లు గెలవడం కాదని, ఆ పార్టీ అన్ని చోట్ల ఓడిపోవాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, పార్టీ కన్వీనర్ గంతి శ్రీనివాసులు, జింకా సూర్యనారాయణ, పంప కొండప్ప, రాగే పరశురాం, రాగే మురళీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమ్మెపై 'ఎస్మా' ప్రయోగం క్రూరత్వమే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



అనంతపురం కల్చరల్, జనవరి 6: అంగన్‌వాడీల సమ్మెపై 'ఎస్మా'ను ప్రయోగిస్తూ జీఓ నంబర్ 2ను జారీ చేయడం వైసీపీ ప్రభుత్వ క్రూరత్వానికి నిదర్శనమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 26 రోజులుగా శాంతియుతంగా నిరసన చేస్తున్న అంగన్‌వాడీలను ఎస్మా చట్ట పరిధిలోకి తీసుకువచ్చి, సమ్మెను నిషేధించడం తగదని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను ఏమాత్రం ఖాతరు చేయని రాష్ట్ర ప్రభుత్వం, సమ్మెను క్రూర చట్టాలద్వారా అణచివేయడాన్ని ప్రజాసంఘాలు ఖండించాలని కోరారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎమర్జెన్సీ కాలంనాటి నల్లచట్టం 'ఎస్మా'ను సీఎం ప్రయోగిస్తున్నారని, సమ్మె కాలానికి జీతాల్లో కోతలు విధించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. 'నా అక్కచెల్లెళ్లు' అని మాట్లాడే ప్రభుత్వ నేతలు ఎస్మా ద్వారా వారి గొంతు నొక్కాలని చూస్తే పర్యావసనాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం తన నియంతృత్వ పోకడలను మార్చుకోవాలని హితవు పలికారు.

సమాజ పునర్నిర్మాణ బాధ్యత మీదే



భావి ఇంజనీర్లతో గవర్నర్ అబ్దుల్ నజీర్
అట్టహాసంగా జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవం

సమాజ పునర్నిర్మాణ బాధ్యత మీదేనని జేఎన్‌టీయూ విద్యార్థులతో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. నైపుణ్యం, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవానికి చాన్స్‌లర్ హోదాలో ఆయన హాజరయ్యారు. వర్సిటీలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగిన వేడులలో ప్రతిభావంతులను బంగారు పతకాలతో సత్కరించారు.

- వివరాలు 7లో..

నేడు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీ

అనంతపురం కల్చరల్, జనవరి 6: నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు జరుగుతాయి. పోటీల కోసం మైదానాన్ని ముస్తాబు చేశారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' కార్యక్రమానికి స్థానికంగా అవే సంస్థ సహకారం అందిస్తోంది. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానానికి రావాల్సి ఉంటుంది. ముగ్గుల పోటీల విజేతలకు అవే వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి బహుమతులను ప్రదానం చేస్తారు.



వైసీపీ నైతికంగా ఓడిపోయింది

- సీఎం జగన్‌ను మార్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు



అనంతపురం అర్బన్, జనవరి 5: వైసీపీ పాలన వంద రోజులు ఉండగానే ఆ పార్టీ నైతికంగా ఓడిపోయిందని, సీఎం కుర్చీలో నుంచి జగన్‌మోహన్‌రెడ్డిని మార్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరితో కలిసి మీడియాతో మాట్లాడారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలను బలవంతంగా ఇతర నియోజకవర్గాలకు జగన్ మారుస్తున్నారని, వారిని మార్చినంత మాత్రాన ఒరిగేదేమీ లేదన్నారు. శిశుపాలుడికి వంద తప్పులు చేసేదాకా శ్రీకృష్ణుడు అవకాశం ఇచ్చాడని, జగన్‌వి లక్ష తప్పులు దాటి ఉంటాయన్నారు. తప్పుడు పనులు, దోపిడీలు, అరాచక, నియంతృత్వ పాలనతో రాష్ట్ర భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా జగన్ తయారయ్యాడని మండిపడ్డారు. జగన్ వీరాభిమానిగా ఉంటూ పార్టీలో కొనసాగి, తన గొంతు జగన్ కోశాడని రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ప్రకటించారని, జగన్ ఇతర ప్రజాప్రతినిధులంతా కలిసి ప్రజల గొంతు కోశారని మండిపడ్డారు. జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు చంద్రబాబునాయుడు చేపట్టిన 'రా కదలిరా' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. టీడీపీ ఇప్పటికే నైతికంగా గెలిచిందని, రాబోయే ఎన్నికల్లో సాంకేతికంగా మాత్రమే గెలవాలన్నారు. ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించే వైసీపీలోని నాయకులు చంద్రబాబు నాయకత్వానికి మద్దతునివ్వాలని కోరారు. అలాంటి నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తామన్నారు. టీడీపీ, జనసేన కూటమి ఇప్పటికే ప్రజాదరణ పొందిందని, ఎన్నికల్లో ఉమ్మడి కూటమి విజయం ఖాయమన్నారు. అరాచక పాలన సాగించిన వైసీపీ నాయకులకు, టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రిటర్న్ గిఫ్ట్‌లు ఇస్తామన్నారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

లారీ- బైక్ ఢీ ఇద్దరు యువకుల దుర్మరణం



సునీల్‌బాబు (ఫైల్)



మోహన్ (ఫైల్)



రాయలచెరువు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదం

యాడికి, జనవరి 6: లారీ-బైక్ ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం యాడికి మండలం రాయలచెరువు గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్డె సునీల్‌బాబు (22), కురుబ మోహన్ (24) అనే ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లి గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మీనారాయణ, కుమారుడు వడ్డె సునీల్‌బాబు, దబ్బర శ్రీరాములు కుమారుడు కురుబ మోహన్‌లు స్నేహితులు. అవివాహితులు. సునీల్ అరటికాయలు కోయడానికి కూలి పనులకు వెళ్లేవాడు. శనివారం సునీల్‌బాబు, మోహన్‌లు తమ సొంత పనుల నిమిత్తం తాడిపత్రికి వెళ్లారు. పనులు ముగించుకొని సొంత గ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. యాడికి మండలం రాయలచెరువు గ్రామ సమీపాన జాతీయ రహదారిపై వీరు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని తాడిపత్రి వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొంది. ద్విచక్రవాహనంలోని సునీల్ బాబు, మోహన్‌లు రోడ్డుపైకి ఎగిరిపడి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీని డ్రైవర్ ఆపకుండా వెళ్లాడు. కిలోమీటర్ దూరంలో లారీ ఆపి, డ్రైవర్ పరారయ్యాడు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఖాళీ భూమిపై కన్ను

- సాగులో లేకున్నా.. ఉన్నట్లు దరఖాస్తులు
- అధికారులపై వైసీపీ నాయకుల ఒత్తిడి..?

కామారుపల్లిలోని భూమి





అనంతపురం రూరల్, జనవరి 6: ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని కాజేసేందుకు అధికార పార్టీకి చెందిన కొందరు ఎత్తుగడ వేస్తున్నారు. రూరల్ మండల పరిధిలోని కామారుపల్లి గ్రామ సర్వే నంబర్లు 179, 182, 185, 205లో 200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. అందులో 160 ఎకరాలను జగనన్న ఇళ్ల స్థలాలకు కేటాయించారు. మిగిలిన 40 ఎకరాలపై ఆ గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. ఆ భూమిని దక్కించుకునేందుకు, సాగులో లేకపోయినా ఉన్నట్లు చూపించి, పట్టాలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కుటుంబ సభ్యుల పేరిట పట్టాలు పొందేందుకు అసైన్‌మెంట్ కమిటీకి దరఖాస్తు చేసుకున్నారని తెలిసింది. ఆ ఊరి స్థానిక ప్రజాప్రతినిధి భర్త అండతో ఈ వ్యవహారం సాగుతోందని సమాచారం. ఆ ప్రజాప్రతినిధి భర్త ఎమ్మెల్యే ద్వారా అధికారులపై ఒత్తిడి చేయిస్తున్నారని గ్రామంలో చర్చించుకుంటున్నారు. ఒత్తిడి నేపథ్యంలో అధికారులు దిక్కుతోచనిస్థితిని ఎదుర్కొంటున్నారు. సర్వే నంబరు 185-1, 185-7లో ఐదు ఎకరాల చొప్పున పది ఎకరాలకు పదేళ్ల క్రితం ఇద్దరికి రెవెన్యూ అధికారులు అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చారు. సాగులో లేకపోయినా.. ఆన్‌లైన్‌లో వారి పేర్లు ఇప్పటికీ ఉన్నాయి. వాటిని సైతం రద్దు చేసి, అసైన్‌మెంట్ కింద పట్టాలు పొందాలని అధికార పార్టీ నాయకులు పావులుకదుపుతున్నారు. ఇప్పటికే జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. ఒక్కొక్కరు ఎకరం నుంచి 2.50 ఎకరాల వరకు పట్టాల కోసం దరఖాస్తు చేశారని తెలిసింది. కామారుపల్లిలో కొందరు భూ పంపిణీ కింద పట్టాలు ఇవ్వాలని కోరారని, దీనిపై నివేదిక ఇవ్వాలని స్థానిక వీఆర్వోను ఆదేశించామని తహసీల్దారు విజయలక్ష్మి తెలిపారు.

ఎస్మాకు బెదరం

- జగన్‌ది రాజకీయం.. మాది పోరాటం
- మాజీ ఎమ్మెల్సీ గేయానంద్



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



అంగన్‌వాడీల రిలేదీక్షలు ప్రారంభిస్తున్న గేయానంద్, సీఐటీయూ నేతలు

అనంతపురం విద్య, జనవరి 6 : సమస్యలు పరిష్కరించకుండా అంగన్‌వాడీల సమ్మెపై 'ఎస్మా' తెస్తే భయపడేది లేదని, మున్ముందు మరింత ఉద్యమిస్తామని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీఐటీయూ నేతలు హెచ్చరించారు. శనివారం అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా నగరంలోని కలెక్టరేట్ వద్ద నిరసన కొనసాగించారు. 26వ రోజు 24 గంటల రిలే దీక్షలను మాజీ ఎమ్మెల్సీ గేయానంద, సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఓట్లు వేసి జగన్‌కు అధికారం కట్టబెడితే....ఆయన తమపై పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. ఆయనది రాజకీయం అయితే మనది పోరాటం అని, అంగన్‌వాడీలకు ప్రజా మద్దతు ఉందని భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శకుంతల, కార్యదర్శి రమాదేవి, జమున మాట్లాడుతూ... అంగన్‌వాడీల పోరాటంతో ప్రభుత్వంలో వణుకు ప్రారంభమయ్యిందని, ప్రభుత్వానికి 2 నెలలే ఉండగా, 6 మాసాలు సమ్మెను నిషేధిస్తూ... ఆదేశాలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. అంగన్‌వాడీ, సీఐటీయూ యూనియన్ల నేతలు నాగమణి, తిప్పమ్మ నాగేశ్వరమ్మ, రామాంజనమ్మ, మేరీ, లక్ష్మి, పంకజ తదితరులు దీక్షల్లో పాల్గొన్నారు.

రేపటిలోగా అంగన్‌వాడీలు విధుల్లో చేరాలి : పీడీ

సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు ఈనెల 8వ తేదీలోగా విధుల్లో చేరాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ గెజిట్, జీవో నంబర్ 2 విడుదల చేసిందని, జిల్లాలోని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు విధులకు హాజరుకావాలన్నారు. హాజరు కాకపోతే ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని ఆమె హెచ్చరించారు.


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న వీసీ రంగజనార్దన


గవర్నర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వీసీ, వర్సిటీ అధికారులు


విద్యార్థులకు బంగారు పతకాలు, పట్టాలను ప్రదానం చేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్


8 గోల్డ్‌మెడల్స్ సాధించిన దాసరి శాంతిని అభినందిస్తున్న వీసీ


బంగారు పతకాలు, పట్టాలు అందుకుంటున్న బీటెక్ విద్యార్థులు


గోల్డ్‌మెడల్స్‌తో పాటు పట్టాలు అందుకుంటున్న బీటెక్ విద్యార్థులు


పీహెచ్‌డీ పట్టాలను అందుకున్న విద్యార్థులు


పీహెచ్‌డీ పట్టాలతో ఆనందం..


స్నాతకోత్సవ వేదికపై గవర్నర్, వీసీ, ఇతర అధికారులు


ప్రముఖుల మాటామంతి


పీహెచ్‌డీ పట్టా తీసుకునేందుకు చంటిబిడ్డతో..

విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలు

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవంలో

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్


మెడల్స్ వచ్చిన సంతోషాన్ని కుటుంబ సభ్యులతో పంచుకుంటున్న విద్యార్థిని

అనంతపురం సెంట్రల్, జనవరి 6: భవిష్యత్ నిర్మాతలు మీరేనని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ విద్యార్థులనుద్దేశించి అన్నారు. నైపుణ్యం, సృజనాత్మకతను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవం శనివారం వర్సిటీలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగింది. ఈ వేడుకకు వర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ హాజరయ్యారు. ఆయనకు సాంకేతిక విద్యా కమిషనర్ నాగరాణి, కలెక్టర్ గౌతమి, వీసీ రంగజనార్దన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ ఘనస్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులేనన్నారు. అభివృద్ధి వేగంగా జరుగుతోందని, ఇందులో ప్రధాన భూమిక ఇంజనీర్లదేనన్నారు. వర్సిటీలో నేర్చుకున్న విద్యతో నూతన ఆవిష్కరణలు సాధ్యమన్నారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ ముందుకుసాగాలని సూచించారు. నూతన ఆవిష్కరణలు సమాజానికి దోహదపడేలా ఉండాలన్నారు. సవాళ్లను స్వీకరించి వాటి పరిష్కారానికి మార్గాలను చూపాలన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మీ ఉన్నతికి మీరే పాటుపడాలన్నారు. ప్రపంచంలోనే మన విద్యావ్యవస్థ పెద్దదన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని చేరేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బానిసత్వం నుంచి ఆత్మనిర్భర్ వైపు..

భారతదేశం వెయ్యి సంవత్సరాల బానిసత్వం నుంచి ఆత్మనిర్భర్‌వైపు నడుస్తోందని. ఈ ప్రయాణంలో ప్రతిఒక్కరి పాత్ర ఉందని ట్రాయ్ మాజీ సభ్యులు, డీఆర్‌డీఓ, నావల్ రీసెర్చ్‌బోర్డ్ మాజీ ఛైర్మన్ డాక్టర్ సత్యనారాయణరాజు పేర్కొన్నారు. ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానాన్ని చేరేందుకు కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. వృత్తిపరమైన విజయమే మీరు అభ్యసించిన విద్యకు నిదర్శనమన్నారు. అనంతరం వీసీ రంగజనార్దన వర్సిటీ అభివృద్ధి అంశాలను వివరించారు. డీఓజీ మాజీ ఛైర్మన్, ఎన్ఐటీకే మాజీ వీసీ ప్రొఫెసర్ కె.బలవీరారెడ్డికి గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అందజేశారు. అదేవిధంగా విద్యార్థులను బంగారు పతకాలతో సత్కరించి పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో తరలివచ్చి...

కష్టపడి చదివిన ఫలితం పట్టాల రూపంలో అందుకున్న వేళ విద్యార్థులు ఆనందంతో గంతేశారు. శనివారం నిర్వహించిన స్నాతకోత్సవానికి విద్యార్థులు వారి కుటుంబసభ్యులతో తరలివచ్చారు. అదేవిధంగా పీహెచ్‌డీ తీసుకునేందుకు కొందరు వారి పిల్లపాపలతో హాజరై సంతోషాన్ని పంచుకున్నారు. బీటెక్ ఇంజనీరింగ్‌లో ఉత్తమ మార్కులు సాధించి ఏకంగా ఎనిమిది గోల్డ్‌మెడల్స్‌ను కైవసం చేసుకున్న దాసరి శాంతికి వీసీ రంగజనార్దన, రిజిస్ట్రార్ శశిధర్ పతకాలను అందజేసి అభినందించారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని డిల్లీ యూనివర్సిటీలో ఫుడ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొదండరామిరెడ్డి తన భార్య, చంటిబిడ్డతో వచ్చి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. మరో విశేషమేమంటే వీసీ రంగజనార్దన, రెక్టార్ విజయకుమార్, శ్రీనివాస్ అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981-83లో ఇంటర్మీడియేట్ అభ్యసించారు. జేఎన్‌టీయూలో 1983-87లో రంగజనార్దన బీటెక్ మెకానికల్, శ్రీనివాస్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ పూర్తిచేశారు. విజయకుమార్ నెల్లూరు ఎన్‌బీకేఆర్‌లో బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ చదివారు. క్లాస్‌మేట్స్ అయిన రంగజనార్దన, విజయకుమార్ చేతులమీదుగా శ్రీనివాస్ పీహెచ్‌డీ పట్టా అందుకోవడం అందరినీ ఆకట్టుకుంది. కాగా శ్రీనివాస్ ప్రస్తుతం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో వైస్‌ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. మరో వైపు ఆడిటోరియం ముందున్న ఎటీఆర్ విగ్రహం వద్ద చిన్నారులు ఫొటోలు దిగారు.

కృషి, పట్టుదలతో చదవాలి

బహుమతుల ప్రదానోత్సవంలో వక్తలు


మొదటి బహుమతిని అందజేస్తున్న ముఖ్య అతిథులు

కొత్తచెరువు, జనవరి 6: కృషి, పట్టుదలతో చదవాలని పలువురు వక్తలు సూచించారు. వదన్యా జనసొసైటీ ఆధ్వర్యంలో డిసెంబరు 17న ప్రతిభా టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఇందులో 35 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారికి బహుమతుల ప్రదాన కార్యక్రమం శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ విశాలఫెర్రర్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహిత బండి నారాయణస్వామి, హెచ్‌సీఎల్ కంపెనీ ప్రెసిడెంట్ విజయానంద్, రచయిత ఎస్కే లెనిన్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మనిషి జీవన విధానాన్ని మార్చేది చదువేనన్నారు. ప్రస్తుతం విద్య, వైద్యం వ్యాపారంగా మారాయని పేద, మధ్య తరగత వారికి అందని దాక్షలా మారుతున్నాయన్నారు. ఆర్డీటీ పేద విద్యార్థులకు విద్యను అందిస్తూ వారి జీవితాల్లో వెలుగు నింపుతోందని కొనియాడారు. అదే బాటలోనే వదన్యా జనసొసైటీ నడుస్తోందన్నారు. విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రథమస్థానం సాధించిన ధర్మవరం బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి జుగేష్‌కుమార్‌కు రూ. 15వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, తులసీకార్తీక్ నిలిచారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు పడపాటి అశోక్, సభ్యులు పాల్గొన్నారు.

జీతాలు ఇస్తే సమ్మె విరమిస్తాం

తేల్చిచెప్పిన శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు


కార్మికులతో చర్చలు జరుపుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

కళ్యాణదుర్గం, జనవరి 6: జీతాలు ఇస్తేనే సమ్మె విరమిస్తామని శ్రీరామిరెడ్డి కార్మికులు తేల్చిచెప్పారు. కళ్యాణదుర్గం పంప్‌హౌస్ వద్ద నిరసనలు చేపడుతున్న శ్రీరామిరెడ్డి కార్మికులతో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు శనివారం చర్చలు జరిపారు. ఫేస్-1 కింద పనిచేస్తున్న కార్మికులకు జీతాలు మంజూరు చేశారని తమకు ఎందుకు ఇవ్వలేదని డీఈ దృష్టికి తీసుకెళ్లారు. తమకు జీతాలు మంజూరు చేశాకే సమ్మె విరమిస్తామన్నారు. సోమవారంనాటికి పూర్తిస్థాయిలో జీతాలు ఇచ్చేలా చూస్తానని డీఈ కార్మికులకు హామీ ఇచ్చారు. కాగా సమ్మె ప్రభావంతో సుమారు 325 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తారస్థాయికి వర్గవిభేదాలు


కలిసిరాని నేతలు

పెనుకొండలో ఎమ్మెల్యే వర్గం దూరం

పురంలో సొంత సామాజికవర్గం నేతలు ఎక్కడ

నాడు సమ్మతి నేడు అసమ్మతి

బదిలీలు చేసినా ఫలితం ఏది



హిందూపురం, జనవరి 6: రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీల బదిలీల ఆట ఆడిస్తోంది. గత నాలుగున్నరేళ్లుగా సిట్టింగులపై తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతోంది. ఈ నేపథ్యంలో జగన్మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు ఆ పార్టీకి చేటు తెప్పిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో జగన్ తీరు మార్చుకోకపోగా సిట్టింగ్‌లపై మోపడంతో సర్వేల పేరుతో సిట్టింగులను కొన్నిచోట్ల మార్చారు, మరికొన్నిచోట్ల బదిలీచేశారు. దీనికితోడు అధికార పార్టీలో అన్ని నియోజకవర్గాల్లోనూ అసమ్మతి సెగలు వర్గవిబేధాలు తారస్థాయికి చేరాయి. ఈ పరిస్థితుల్లో ఇన్‌చార్జ్‌లను మార్చినా ఫలితం లేకుండా పోతోందని సొంత పార్టీ నాయకులే విమర్శలు గుప్పిస్తున్నారు.

పెనుకొండలో ఎమ్మెల్యే వర్గం దూరం

పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన శంకర్‌నారాయణకు మూడేళ్లకుపైగా అసమ్మతి సెగ మొదలైంది. అధికార పార్టీకి ఓ బలమైన సామాజిక వర్గం నేతలపై శంకర్‌నారాయణ అక్రమ కేసులు పెట్టించారని ఆ సామాజిక వర్గం నాయకులు ఆయనపై, అతని సోదరులపై గుర్రుగా ఉన్నారు. ఎలాగైనా శంకర్‌నారాయణను తప్పించాలని అధిష్టానం వద్ద ఆయన వ్యతిరేక వర్గీయులు గత మూడు సంవత్సరాలుగా పావులు కదిపారు. దీంతో ఆయనకు మంత్రి పదవి తప్పించారు. అయినా వర్గపోరు తగ్గలేదు. దీనిపై అధిష్టానానికి ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు పలుసార్లు ఫిర్యాదు చేశారు. ఆఖరికి శంకర్‌నారాయణను అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పంపుతూ పెనుకొండకు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి అయిన ఉషశ్రీ చరణ్‌ను పంపారు. రెండు రోజుల క్రితం మంత్రి భర్త శంకర్‌నారాయణవద్దకు వెళ్లగా తీవ్రంగా మందలించినట్లు సమాచారం. నేను ఆఖరి వరకు పెనుకొండ ఎమ్మెల్యే టికెట్‌కు పోరాడతానని నన్ను అడగకుండా నా వద్దకు ఎలా వచ్చారంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే ఎమ్మెల్యే వర్గీయులు శంకర్‌నారాయణ ఇక్కడే ఉండాలని నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి ఉషశ్రీ చరణ్ పెనుకొండకు రాగా ఎమ్మెల్యే వర్గీయులు ఎవరూ స్వాగతం పలకడానికి, కలవడానికి వెళ్లలేదని సమాచారం. మొదటి రోజు ఆమె వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులే అధికంగా పాల్గొన్నట్లు అందులో కూడా ఓ సామాజిక వర్గం నేతలే ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అక్కడ మొన్నటి వరకు అసమ్మతి వర్గీయులుగా ఉన్నవారు ప్రస్తుతం ఉషశ్రీకి మద్దతు పలుకుతుండగా నిన్నటి వరకు ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉన్న వారంతా ఉషశ్రీ వ్యతిరేక వర్గంలో చేరారు.

పురంలో సొంత సామాజికవర్గం నేతలు ఎక్కడ ?

ఇదిలా ఉంటే హిందూపురం పార్లమెంట్ వైసీపీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన జే.శాంత శనివారం మొదటిసారిగా హిందూపురానికి విచ్చేశారు. అయితే మూడు రోజులుగా ఆమె రాకపై తీవ్ర చర్చ జరిగింది. ఎట్టకేలకు ఆమె హిందూపురానికి రాగా కేవలం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త దీపిక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు మాత్రమే ఆమెకు స్వాగతం పలికి కలిసిన వారిలో ఉన్నారు. మరో రెండు వర్గాలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు అటుగా వెళ్లలేదు. అంతేకాక శాంత సొంత సామాజిక వర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులుండగా అధిక శాతం మంది సొంత సామాజికవర్గం నేతలు ఆమెకు స్వాగతం పలకడానికి వెళ్లలేదు. ఆమెపై ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన పోస్టు కారణంగా మైనార్టీ నాయకులు కూడా కలవడానికి వెళ్లలేదని సమాచారం. కర్నాటకలో బీజేపీలో ఉంటూ ఇక్కడ వైసీపీ తరుపున పోటీలో ఉండటంపై ఆ సామాజికవర్గం నేతలు ఆమె వద్దకు వెళ్లడానికి సైతం ఇష్టపడటం లేదని తెలుస్తోంది.దీంతో సమన్వయకర్త వర్గీయులు కొంతమంది మాత్రం ఆమెను స్వాగతించినట్లు తెలిసింది. మరో రెండు వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆమె రాక సందర్భంగా ఎంతమంది వచ్చారన్నదానిపై చర్చ ప్రారంభించారు. ఏది ఏమైనా ఇన్‌చార్జ్‌లను మార్చినా ఆ పార్టీకి చేకూరే ప్రయోజనం శూన్యమని సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు.

అర్హులు ఆర్థిక అభివృద్ధి చెందటమే

వికసిత్ భారత్ ఉద్దేశం

గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్


మాట్లాడుతున్న గవర్నర్

బుక్కరాయసముద్రం, జనవరి 6: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక ప్రయోజనం చేకూర్చడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రధాన ఉద్దేశమని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బుక్కరాయసముద్రంలోని జిల్లా పరిషత్ మైదానంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఆయనకు కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్ స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ పథకం ఏదైనా అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులకు లబ్ధిచేకూరేలా కృషి చేయాలన్నారు. ప్రధానంగా మహిళలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గడచిన ఐదు సంవత్సరాల్లో దేశంలో 13 కోట్ల మంది ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. సంక్షేమం, ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించడం కోసమే ఆయుష్మాన్ భారత్ యోజ న, పీఎం ఆవాస్‌యోజన, పీఎం పోషణ్ అభియాన్ తదితర పథకాలు ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే భారతదేశం ఆర్థిక రంగంలో ఐదోస్థానంలో ఉందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి మరింత సాధ్యమన్నారు. అదేవిధంగా కేంద్రీయ విశ్వవిద్యాలయం ద్వారా విద్యాభివృద్ధి ఉంటుందన్నారు. ఉపాధి అవకాశాలూ పెరుగుతాయన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రదర్శన

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ప్రదర్శనను గవర్నర్ సందర్శించారు. ఒక్కొక్క పథకం గురించి గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఈ పథకాల వల్ల ఎంత అభివృద్ధి జరిగింది..? తదితర విషయాలను తెలుసుకున్నారు.

మొబైల్ ఐఈసీ వాహనం ప్రారంభం

వికసిత్ భారత్ సంకల్పయాత్ర మొబైల్ ఐఈసీ వాహనాన్ని జెండా ఊపి గవర్నర్ ప్రారంభించారు. ఈ మొబైల్ వాహనం ద్వారా ప్రతి గ్రామంలో వివిధ పథకాల కింద అర్హులైన, ఇప్పటి వరుకు ప్రయోజనాలు పొందని వారికి లబ్ధిచేకూరనుంది. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై లఘుచిత్రాలను ప్రదర్శించారు.

ప్రసంగించిన డ్వాక్రా మహిళలు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై డ్వాక్రా మహిళలు లింగమ్మ, నాగజ్యోతి, భవానీ మాట్లాడారు. వారి అభివృద్ధికి ఏవిధంగా దోహదపడ్డాయో వివరించారు. వీరిని గవర్నర్ సన్మానించారు. తక్కువ పొలంలో ఎక్కువ ఆదాయం సాధించిన బుక్కరాయసముద్రం రైతు జనార్దన్‌రెడ్డి, జూడోలో ప్రతిభచూపుతున్న 8వ తరగతి విద్యార్థి సాకేదర్శన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డపద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తల చేరిక



ప్రభాకర్ చౌదరి సమక్షంలో పార్టీలోకి చేరిన వైసీపీ కార్యకర్తలు

అనంతపురం అర్బన్, జనవరి 6: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 20 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. శనివారం అర్బన్ టీడీపీ కార్యాలయంలో వైసీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి టీడీపీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ అరాచక వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు కలిసివచ్చే అందరినీ పార్టీలోకి ఆహ్వానిస్తామన్నారు. ఇటీవల నగరానికి చెందిన ముస్లిం మైనార్టీలతోపాటు ఇతర పార్టీలు, కుల సంఘాల నాయకులను చంద్రబాబు సమక్షంలో పార్టీలోకి చేర్పించామన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. డిష్ నాగరాజు, దేవళ్ల మురళీ, ముక్తియార్, అజీజ్, జేఎం బాషా, విజయశ్రీరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాచైతన్య యాత్రకు సంఘీభావం



పరిటాల శ్రీరామ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కుమ్మర శాలివాహన సమితి నాయకులు

అనంతపురంరూరల్, జనవరి 6: తెలుగుదేశం పార్టీ ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ధర్మవరంలో చేపట్టిన ప్రజా చైతన్యయాత్రకు కుమ్మర శాలివాహన సాధికార కమిటీ నాయకులు సంఘీభావం తెలిపారు. ధర్మవరం పట్టణంలో శనివారం జరుగుతున్న కార్యక్రమంలో శ్రీరామ్‌ను ఆయన వెంట నడిచారు. రాష్ట్ర కన్వీనర్ పోతలయ్య, సత్యసాయి, అనంతపురం జిల్లాల కన్వీనర్లు రామాంజనేయులు, ప్రదీప్ కుమార్, రాష్ట్ర డైరెక్టర్ ఓబుళపతి, నాయకులు ఓబులేసు, రాఘవేంద్ర, నాగేంద్ర. గురు, రామాంజి, పోతులయ్య, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

రాప్తాడు: టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రకు రాప్తాడు మండల నాయకులు సంఘీభావం తెలిపారు. కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, కిష్టా, అశ్వర్థ, అనిల్ శనివారం ధర్మవరం వెళ్లి పరిటాల శ్రీరామ్ పాదయాత్రలో ఆయన వెంట నడిచారు.

బాలుర జూనియర్ హాకీ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా హాకీ బాలుర జూనియర్ జట్టు ఇదే..

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6: జిల్లాస్థాయి జూనియర్ బాలుర హాకీ జట్టును ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో హాకీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనీల్‌కుమార్ తెలిపారు. జట్టులో మహేష్, లక్ష్మీనరసింహ, గోవర్ధన్, రాము, రాజా, అక్షయ్‌కుమార్, వేణు, సతీష్, రేవంత్‌రెడ్డి, భానుతేజ, తిప్పేస్వామి, తరుణ్, సుధీర్, రాజన్న, అశోక్, ప్రవీణ్, బాబా ఫక్రుద్దీన్, కార్తీక్ ఎంపిక కాగా స్టాండ్‌బైలుగా చేతన్‌కళ్యాణ్, జస్వంత్, వెంకటేష్ ఎంపికయ్యారు. ఎంపికైన జట్టు తిరుపతిలో 9 నుంచి నిర్వహించే 14వ ఏపీ జూనియర్స్ బాలుర హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ సహాయ కార్యదర్శి అక్రమ్ బాషా, పీఈటీ వెంకటేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీటీ అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6: జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ మైదానంలో ఏపీఎల్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఇందులో 32 క్లబ్‌ల జట్లు పాల్గొంటున్నాయని, గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు అవకాశం కల్పించడమే తమ లక్ష్యమన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా క్రికెట్ సంఘం కోశాధికారి షబ్బీర్‌అహ్మద్, తపోవనం క్రికెట్ అకాడమీ శివప్రసాద్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6: జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. స్థానిక అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. విజేతల్లో...సింగిల్స్ 35ప్లస్‌లో ప్రసాద్, డబుల్స్‌లో శివప్రసాద్‌నాయుడు-మల్లి నిలిచారు. 40ప్లస్ సింగిల్స్‌లో ప్రసాద్, డబుల్స్‌లో ప్రతాప్-రామాంజనేయులు విజేతలుగా నిలిచారు. 45ప్లస్ సింగిల్స్‌లో రామాంజనేయలు, డబుల్స్‌లో ప్రతాప్-రామాంజనేయులు గెలిచారు. 50ప్లస్ సింగిల్స్‌లో శ్రీనివాసరెడ్డి నిలిచారు. జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, జయకుమార్, కోశాధికారి సాంబమూర్తి, ఉపాధ్యక్షులు మహ్మద్‌షఫీ, దాదాఖలందర్, డీఎస్‌డీఏ నరసింహారెడ్డి, కోచ్ నరేష్‌కుమార్ గౌడ్, జీవన్‌కుమార్, అజీజ్ పాల్గొన్నారు.

తైక్వాండో ఉచిత శిక్షణ ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6: నగరంలోని ఒకటో రోడ్డు పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నతపాఠశాలలో శనివారం ఉచిత తైక్వాండో శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి శాంతరాజ్ చేతుల మీదుగా శిబిరం ప్రారంభమైంది. శిబిరంలో యుద్ధకళలు బాల, బాలికల క్రీడాకారులకు ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, కోచ్ రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తున్నా పట్టదా?

● టీడీపీ డాక్టర్స్ సెల్ కార్యదర్శి లక్ష్మీప్రసాద్



రోడ్డుపై మురుగు నీటిని చూపుతున్న లక్ష్మీప్రసాద్

అనంతపురం అర్బన్, జనవరి 6: నగరంలోని 20వ డివిజన్ పాత రమణ, రమేష్ థియేటర్ సమీపంలో రోడ్డుపైకి మురుగు నీరు ప్రవహిస్తున్నా పట్టించుకోవడం లేదని టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎం లక్ష్మీప్రసాద్ మండిపడ్డారు. శనివారం 20వ డివిజన్‌లో డ్రైనేజీ సరిగా లేకపోవడంతో రోడ్లపైకి వచ్చిన మురుగు నీటిని చూపిస్తూ ఆయన సెల్ఫీ చాలెంజ్ దిగారు. కార్మికులు సమ్మెలో ఉన్నా వారి సమస్యల పరిష్కారంపై పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.



కనగానపల్లిలో కరపత్రాలు పంచుతున్న నాయకులు



చెన్నేకొత్తపల్లి మండలం ఉప్పరవాండ్లపల్లిలో...

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

● భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, జనవరి 6: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు అని ఆ పార్టీ నాయకులు అన్నారు. మండలంలోని ఉప్పరవాండ్ల కొట్టాలలో శనివారం బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు.

ధర్మవరంరూరల్: కనగానపల్లి మండలంలోని కొండపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు శనివారం బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి పథకాలను వివరించారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే పథకాలన్నీ నెరవేరుస్తారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెంవెంకటేష్, మండలకన్వీనర్ యాతంపోతలయ్య, వేపకుంట సుధాకర్, ముకుందనాయుడు, పూజారి రాజాకృష్ణ, తెలుగుయువత బట్టా సురేష్‌చౌదరి, బిల్లేదామోదర్, పూజారి నాగభూషణ, ములుగురు సంజీవ్, లక్ష్మీనరసమ్మ, రాము, నాగార్జున, వెంకటరాముడు, కామన్న, ముత్యాలు, రామలింగ, భూపాల్, ప్రభాకర్‌రెడ్డి, జయప్ప, వెంకటస్వామిరెడ్డి,సీతప్ప పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని రామగిరి పంచాయతీ ఆర్‌కొత్తపల్లిలో టీడీపీ నాయకులు శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. టీడీపీ ప్రకటించిన ఆరు పథకాల గురించి తెలియజేస్తూ పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, రమీజా బేగం చమన్‌సాబ్, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధానకార్యదర్శి మారుతీప్రసాద్, పరంధామ యాదవ్, శివరాం, శివకుమార్, తిరుపాలప్ప పాల్గొన్నారు.



రామగిరి మండలం ఆర్ కొత్తపల్లిలో...

మృతుల కుటుంబాలకు పరామర్శ



ఆంజనేయులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల సునీత

రామగిరి, జనవరి 6: మండలంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దళిత ఆంజనేయులు కుటుంబాన్ని, కలికివాండ్లపల్లికి చెందిన వడ్డేపోలేరమ్మ అకస్మాత్తుగా మరణించడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పరిటాలసునీత పరామర్శించారు. శనివారం ఆమె వారి గ్రామాలకు వెళ్లి మృతులు ఆంజనేయులు, పోలేరమ్మ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్యమాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, నాయకులు బాలరాజు, నారాయణస్వామి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో టీడీపీ మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు కార్తీక్ నందన్ కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి పరిటాల సునీత పరామర్శించారు. వారం రోజులు క్రితం కార్తీక్ తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. వారి ఇంటికి వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు.


రాజకీయాల్లో యువత భాగస్వాములు కావాలి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6: దేశం అభివృద్ధి బాటలో నడవాలంటే యువత రాజకీయాల్లో భాగస్వాములు కావాలని పలువురు అధికారులు అన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మై భారత్-వికసిత్ భారత్ 2047 అంశంపై శనివారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ఎన్‌వైకే సమావేశమందిరంలో వక్తృత్వపోటీలు నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొదటి స్థానంలో నిలిచిన వెన్నెల, ద్వితీయ స్థానం మహతేష్, తృతీయ స్థానం ఆదిత్యరాజ్, నాగరత్నలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. అధ్యాత్మికవేత్త ప్రసాద్, ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ రమేష్ సుంకర, సంస్కృత అధ్యాపకులు శర్మ, జాతీయ యువకార్యకర్త వెంకటేష్ పాల్గొన్నారు.

అటల్ మారథాన్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

అనంతపురం విద్య, జనవరి 6: అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అటల్ మారథాన్ 2023-24కు అన్ని పాఠశాలలు రిజిస్ట్రేషన్ చేసువాలని ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు, ఏపీసీ వరప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని హైస్కూల్స్ జ్టిఇ://్చజూ.ఇజీటౌజూర్శి.్గౌటజ...వెబ్‌సైట్‌లో పాఠశాల వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, సైన్స్, గణితం ఉపాధ్యాయులు విద్యార్థులను టీమ్స్‌గా రిజిస్టర్ చేయాలని సూచించారు. 75 ఏళ్ల గణతంత్ర దినోత్సవాల నేపథ్యంలో ప్రతి స్కూల్ నుంచి విద్యార్థులు అటల్ మారథాన్‌లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుతత్వ, మున్సిపల్, కేజీబీవీ, వెల్ఫేర్, ప్రైవేట్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు.

నంజుండప్ప మృతికి సంతాపం



నంజుండప్ప (ఫైల్)

అనంతపురం కల్చరల్, జనవరి 6: సీనియర్ రంగస్థల కళాకారుడు నంజుండప్ప(76) మృతిపట్ల జనప్రియ కవి ఏలూరు యంగన్న, కళాకారులు రాము, రమేష్, చెన్నారెడ్డి, మురళి, కొండన్న, పట్నం శివప్రసాద్, శివరామిరెడ్డి శనివారం సంయుక్త ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. వృత్తిరీత్యా వాణిజ్య పన్నులశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన నంజుండప్ప ప్రవృత్తిరీత్యా లలితకళా పరిషత్ కళాకారులతో కలిసి ఎన్నో నాటకాల్లో తనదైన శైలిలో విభిన్న పాత్రలతో అలరించారని గుర్తుచేసుకున్నారు. అందరికీ కావాల్సినవాడిగా మెలిగిన నంజుండప్ప మృతి కళారంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

2వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

● కేఎం జకీవుల్లా

అనంతపురం అర్బన్, జనవరి 6: టీడీపీ అధికారంలోకి రాగానే రెండో డివిజన్ యల్లమ్మ వీధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు కేఎం జకీవుల్లా హామీ ఇచ్చారు. శనివారం అనంతపురం అర్బన్ రెండో డివిజన్‌లో ఆయన పర్యటించారు. డ్రైనేజీలు సరిగాలేక ఇబ్బందిగా ఉందని, తాగునీటి సమస్య అధికంగా ఉందని స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. రాయల్ మురళీ, ఫక్రుద్దీన్, మోహన్‌కుమార్, మాధవ్ యాదవ్, పరమేష్, షేక్షా, జిలాన్ బాషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం దుర్మార్గం

అనంతపురం అర్బన్, జనవరి 6: అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు మండిపడ్డారు. శనివారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంతో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను సచివాలయ సిబ్బందితో పగలగొట్టించి తెరిపించడంతోపాటు తాజాగా ఎస్మా ప్రయోగించడం సరికాదన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో జగన్‌పై పొగడ్తలు

బుక్కరాయసముద్రం, జనవరి 6: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలపై అవగాహన కల్పించాల్సిన సభా వేదికపై సీఎం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి వివరిస్తూ పొగడ్తలు వర్షం కురిపించింది. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఎదుటే ఎమ్మెల్యే, ఎంపీ తలారి రంగయ్య కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి అవగాహన కల్పించాల్సి ఉండగా వాటిని విస్మరించారు. సీఎం జగన్ చేపట్టిన పథకాలుతో పాటు, రాష్ట్రంలో 8800 వేల కోట్లతో మెడికల్ కళాశాలు ఏర్పాటు చేసిందని, ఆరోగ్యశ్రీ తదితర పథకాలు చేశారని పొగడ్తల వర్షం కురిపించారు. ఇలా రాష్ట్ర కార్యక్రమాలకు సంబంధించి పథకాలపై మాత్రమే మాట్లాడటం ఏమిటని, వైసీపీ మీటింగ్‌లా ఉందని అక్కడికి వచ్చిన అధికారులు, ప్రజలు చర్చింకుంటున్నారు.

జిల్లాకు 5,708 కొత్త రేషన్‌కార్డులు

అనంతపురం టౌన్, జనవరి 6: అనంత జిల్లాకు కొత్త రేషన్‌కార్డులును ప్రభుత్వం మంజూరు చేసింది. కొన్నినెలలుగా లబ్ధిదారులు ఈకార్డులకు కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడడంతో ఎట్టకేలకు కొత్త రేషన్‌కార్డులను కేటాయించింది. జిల్లాకు 5,708 కొత్త రేషన్‌కార్డులు మంజూరైనట్లు శనివారం జాయింట్‌కలెక్టరు కేతన్‌గార్గ్, డీఎస్‌ఓ శోభారాణి అధికారికంగా తెలిపారు. ఈకొత్త కార్డులలో 12,793 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు.

గవర్నర్‌కు సమస్యలు చెప్పకుండా నిర్బంధించడం తగదు

● ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి

రాప్తాడు, జనవరి 6: గవర్నర్ జిల్లా పర్యటనకు వస్తే సమస్యలు చెప్పనీయకుండా ప్రజా సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి నిర్బంధిస్తారా అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి విమర్శించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా హరిని రాప్తాడు పోలీసులు శనివారం తెల్లవారుజామున అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. ఆయన మాట్లాడుతూ గవర్నర్‌ను కలిసి తమ సమస్యలను వినతి పత్రం ద్వారా తెలిపేందుకు చొరవ చూపాల్సిన అధికారులే అరెస్టు చేసి నిర్బంధించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

బండల తొలగింపుపై ఫిర్యాదు

అనంతపురం క్రైం, జనవరి 6: ఓ ప్రైవేట్ స్థలంలో కొందరు వ్యక్తులు నాటిన బండలు పగలకొట్టిన ఘటనపై నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గుత్తిరోడ్డుకు చెందిన అశ్వమారెన్నకు మారుతినగర్ శివారులో ఆరు సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలం 2018లో కొన్నారని బాధితులు చెబుతున్నారు. ఆ స్థలంలో శనివారం బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంజినయ్య మరికొంతమంది బండలను పగలకొట్టారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనులపై ఎప్పుడైనా తీర్మానాలు చేశారా?

● అధికారులను నిలదీసిన ఎంపీటీసీలు



వైసీపీ సర్పంచ్‌తో వాగ్వాదం చేస్తున్న ఎంపీటీసీ రఘునాథరెడ్డి

శింగనమల, జనవరి 6: మండలంలో ఇప్పటివరికి ఎనిమిది సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. ఏ సమావేశంలోనైనా అభివృద్ధి పనులకు తీర్మానం చేశారాని అధికారులను ఎంపీటీసీలు నిలదీశారు. శనివారం నియోజకవర్గ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 11.20 గంటలైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు రాకపోవడంతో సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. కొరివిపల్లి ఎంపీటీసీ రఘునాథ రెడ్డి సమస్యలపై అడుగుతున్న సమయంలో వైసీపీ సర్పంచ్ అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఏ సమావేశంలోనైనా అభివృద్ధి పనులకు తీర్మానం చేశారా అని ఎంపీటీసీ నిలదీశారు. స్పందించిన ఎంపీడీఓ ప్రతి సమావేశంలో చేస్తున్నాం కదా అని బుకాయించారు. ఎంపీటీసీ మీరు ఒక సమావేశంలో తీర్మానం చేసినట్లు రికార్డులు చూపండి అంటూ నిలదీశారు. దీనిపై ఎంపీడీఓ సమాధానం చెప్పలేక మిన్నకుండిపోయారు. సమావేశానికి అతి తక్కువమంది హాజరయ్యారు. ఎంపీడీఓ నిర్మలాకూమారి, ఎంపీపీ యోగేశ్వరి, విజయమ్మ, డేగలలలితమ్మ, రాజారెడ్డి, ఉమా, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగిస్తే... అదరం బెదరం

శింగనమల, జనవరి 6: తమ న్యాయమైన సమస్యలు తీర్చాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 26వ రోజూ కొనసాగింది. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించే జీఓకు అంగన్‌వాడీలు బెదిరే ప్రసక్తి లేదని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ అన్నారు. శనివారం నిర్వహించిన సమ్మెకు చిన్నప్పయాదవ్, మధుయాదవ్, నేసే మధు సంఘీభావం తెలిపారు...

రామగిరి: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన సమ్మె 26వ రోజూ కొనసాగింది. అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. వేతనాలు రాక విరాళాలు ఇవ్వాలని హుండీ ఏర్పాటుచేసుకున్నారు అనంతరం వారు మాట్లాడుతూ 26 రోజులుగా తాము సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు.

నార్పల: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 26వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలు 26వ అంకెను కనబరుస్తు వినూత్నంగా నిరసన తెలిపారు.



రామగిరిలో ఒంటికాలిపై నిరసన...



నార్పలలో వినూత్నంగా అంగన్‌వాడీల నిరసన



శింగమలలో రైతు సంఘం నాయకుల సంఘీభావం

ఘనంగా కనకదాస విగ్రహం ఊరేగింపు



కనకదాస విగ్రహం ఊరేగింపులో పాల్గొన్న పరిటాల సునీత, బీకే పార్థసారథి

ఆత్మకూరు జనవరి 6: మండల కేంద్రంలో కురుబ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించనున్న కనకదాస కాస్య విగ్రహం ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి పరిటాల సునీత, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు పార్థసారధి హాజరయ్యారు. కురుబలు బాణ సంచా కాల్చి వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో విగ్రహం ఊరేగింపు కార్యక్రమానకి కురుబలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చిన్నారులు, యువతులు జ్యోతులు పట్టుకుని ఊరేగింపులో ముందు నడిచారు. జిల్లా కురుబ సంఘం సభ్యులతో కలసి నడవడం ఎంతో ఆనందంగా ఉందని పరిటాల సునీత అన్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు కదిలారు. కురుబలకు పార్టీ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, జిల్లా నాయకులు అనీల్ చౌదరి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పరుశురామ్, సాధికార కమిటీ కన్వీనర్ గంగులకుంట రమణ, మాజీ ఎంపీపీ మాధవి, వైస్ ఎంపీపీ ప్రతాప్, వేణుగోపాల్, సుబ్బర హరి, కాంట్రాక్టర్ పోతులయ్య, పంపు కొండప్ప, నాగన్న, ప్రసాద్, చిరంజీవి, మల్లికార్జున, మారుతి, ఆదెప్ప, పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

అత్మకూరు, జనవరి 6: వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించడానికి టీడీపీ కార్యకర్తలు నాయకులు సైనికుల్లా పని చేయాలని మాజీ మంత్రి పరిటాల సునీత, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు పార్థసారథి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసీపీ అరాచకాలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలన్నారు. చంద్రబాబు నాయుడు నిర్వహించే 'రా కదలిరా' కార్యక్రమానికి ప్రజల ఆదరణ పెరుగుతోందన్నారు. గ్రామస్థాయి నుంచి అనుబంధ సంఘాల నాయకులు చిత్తశుద్ధితో పాల్గొన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలు ప్రజలకు ఎలా ఉపయోగపడతాయో ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనను అంతమొందించాలి

● ఆలం నరసానాయుడు



నార్పల, జనవరి 6: వైసీపీ పాలనను అంతమొందించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు అన్నారు. శనివారం మండలంలోని బొందలవాడ గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సైకో జగన్‌రెడ్డి పాలన నుంచి తుది ముట్టించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. మన అందరి బాధ్యతగా రా కదలిరా కార్యక్రమం ద్వారా ప్రజలందరూ చైతన్యవంతులు కావాలన్నారు. వైసీపీ దగా ప్రభుత్వానికి చమర గీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ప్రజలందరూ ఎంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

టీడీపీ రజక సాధికార సమితి సభ్యురాలిగా శోభ

అనంతపురం అర్బన్, జనవరి 6: టీడీపీ రాష్ట్ర రజక సాధికార సమితి సభ్యురాలిగా శోభ నియమితులయ్యారు. శనివారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, హసీనా, సుజాత పాల్గొన్నారు.

తెలుగు యువత కార్యదర్శిగా ప్రతాప్



నార్పల, జనవరి 6: మండల కేంద్రానికి చెందిన తలారి ప్రతాప్‌ను శనివారం పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ తన ఎంపికకు కృషి చేసిన పార్లమెంట్ అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడుకు, జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు.


వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జనవరి 6: మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం ఆవరణలో రాములవారి ఆలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ యంత్రస్థాపన చేయడంతోపాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా ధ్వజస్తంభ దాత పాటిల్ ప్రభాకర్‌రెడ్డి కుటుంబానికి స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. అనంతరం ఆలయ ముఖమండపం పునర్నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటస్వామి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, సురేషు, అశ్వత్థమ్మ పాల్గొన్నారు.

అయోధ్య రాముని అంక్షితల పంపిణీ



మన్నీలలో అంక్షితలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

అనంతపురంరూరల్, జనవరి 6: మండలంలోని మన్నిల గ్రామంలో అయోధ్య రాముని అంక్షితలు పంపిణీ చేశారు. శనివారం గ్రామ భజనబృందం, గ్రామస్థుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీరాముని చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగిస్తూ..రామ కీర్తలు ఆలపించారు. గ్రామంలోని వారికి అంక్షితలు, ఆహ్వాన కరపత్రాలు అందజేశారు.

రామగిరి: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామపెద్దల ఆధ్వర్యంలో శనివారం అయోధ్య రాముని అక్షింతలు ఊరేగించారు. ఆంజనేయస్వామి దేవాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో భజనలు చేస్తూ ఊరేగించారు. పోలేపల్లి, అక్కంపల్లి గ్రామాల్లో కూడా పుర వీధుల గుండా ఊరేగించారు.


గుత్తిలో సోది చెబుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


గుంతకల్లులో అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీపీఐ జగదీష్, నాయకులు


వజ్రకరూరులో దీక్షల్లో కూర్చున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


ఉరవకొండలో గాంధీ విగ్రహం వద్ద మౌన ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీలు


విడపనకల్లులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


తాడిపత్రిలో అంగన్‌వాడీ వర్కర్లతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి


యాడికిలో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్లు

వినూత్నంగా నిరసన

డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీవర్కర్లు, హెల్పర్లు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం 26వ రోజూ వివిధ ప్రాంతాల్లో వినూత్నంగా జరిగింది. గుత్తిలో సోది చెబుతూ, గుంతకల్లులో ఐసీడీఎస్‌కు గ్రహణం పట్టిందంటూ, ఉరవకొండలో మౌన ప్రదర్శన నిర్వహిస్తూ, విడపనకల్లులో కబడ్డీ ఆడుతూ, బెళుగుప్పలో మోకాళ్లపై నిలబడి, బొమ్మనహాళ్‌లో మెడకు ఉరితాళ్లు బిగించుకుని, నిరసన తెలిపారు. కళ్యాణదుర్గంలో తొడగొట్టి ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. వీరికి తాడిపత్రిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి, గుంతకల్లులో సీపీఐ జగదీష్ సంఘీభావం తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


పుట్లూరులో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


బెళుగుప్పలో ప్రభుత్వానికి కళ్లు కనిపించవంటూ మోకాళ్లపై నిలబడి నిరసన చేస్తున్న అంగన్‌వాడీలు


కుందుర్పిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


కళ్యాణదుర్గంలో సెల్‌ఫోన్లు మాకొద్దు అంటూ తాళాలు కొడుతూ నిరసన తెలిపిన అంగన్‌వాడీలు


బొమ్మనహాళ్‌లో మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన చేస్తున్న అంగన్‌వాడీలు


గుమ్మఘట్టలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


డీ.హీరేహాళ్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో భోజనాలు చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

మద్యం మత్తులో ఘర్షణ

పుట్లూరు, జనవరి 6: మండలంలోని మడుగుపల్లి గ్రామంలో మద్యం మత్తులో ఘర్షణ జరిగినట్లు పోలీసులు శనివారం తెలిపారు. ఎస్సీకాలనీలో రామ్‌కుమార్, అనిల్‌కుమార్, శివశంకర్ మద్యం తాగి గొడవ పడ్డారన్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం

తాడిపత్రిటౌన్, జనవరి 6: స్థానిక సబ్‌జైలులో శనివారం సోషల్ ఇంక్యుబేషన్‌ను ప్రారంభించినట్లు జైలర్ కరీముల్లా తెలిపారు. ఇందులో భాగంగా జైలుకు వచ్చే నిందితుల మానసిక పరిస్థితి గమనించి వారికి వైద్యులచేత కౌన్సెలింగ్ ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు దాసు, న్యాయవాది సతీష్ పాల్గొన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్

యల్లనూరు, జనవరి6: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 17మంది రౌడీషీటర్లను శనివారం బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వ్యాసాపురం, వెన్నపూసపల్లి గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి తహసీల్దార్ వద్ద హాజరుపరిచామన్నారు.

ఆలయ గోపురం నిర్మాణానికి శ్రీకారం

యల్లనూరు, జనవరి 6: మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న వెంకటరమణస్వామి ఆలయ గోపుర నిర్మాణానికి శనివారం నిర్వాహకులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి తాడిపత్రి ఎమ్మెల్యే సతీసమేతంగా హాజరయ్యారు. అనంతరం గుడి నిర్మాణ పనులను పరిశీలించారు.

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, జనవరి 6: మండలంలోని పెన్న హోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవ నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు.

పింఛన్ల కోసం ఎదురుచూపులు

యల్లనూరు, జనవరి6: మండలంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. శుక్రవారం పంపిణీ కార్యక్రమం ప్రారంభించినప్పటికి ప్రభుత్వం నుంచి అరకొరగా డబ్బులు అందడంతో కొంతమందికి మాత్రమే పంపిణీచేశారు. శనివారం మధ్యాహ్నం వరకు ఖాతాలో డబ్బులు జమకాకపోవడంతో అధికారులు సైతం బ్యాంక్ వద్ద పడిగాపులు కాశారు. ఆదివారం కావడంతో సోమవారం మధ్యాహ్నం తర్వాత డబ్బులు వస్తే పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

స్వాతి నక్షత్ర పూజలు

తాడిపత్రిటౌన్, జనవరి6: మండలంలోని ఆవుల తిప్పాయపల్లి గ్రామసమీపంలో ఉన్న ఓబులేసుకోనలో స్వాతినక్షత్ర పూజలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామికి పలురకాల పూలతో విశేష అలంకరణచేసి పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం


ఊడిపడ్డ పైకప్పు పెచ్చులు

తాడిపత్రి, జనవరి6: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. అక్కడే కూర్చొన్న న్యాయవాదులు చక్రపాణి, సూర్యనారాయణ, కుమారస్వామిలతోపాటు పలువురికి ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి బార్ రూంను పరిశీలించారు.

రఘువీరాని గెలిపించుకుందాం

బ్రహ్మసముద్రం, జనవరి 6: సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి ఆదేశాల మేరకు గ్రామగ్రామానికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ముప్పలకుంట, పిల్లలపల్లి, గొంచిరెడ్డిపల్లి, సుగేపల్లి, కోనాపురం, సంతే కొండాపురం, మామడూరు, పాల వెంకటాపురం, నంజాపురం, భైరసముద్రం, నాగిరెడ్డిపల్లి గ్రామాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రఘువీరారెడ్డిని గెలిపించుకోవడం ద్వారా నియోజకవర్గానికి జరిగే లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో రాంభూపాల్ రెడ్డి, కృష్ణమూర్తి యాదవ్, కరీంసాబ్, బలరాం, ఈరన్న, ఈశ్వరప్రసాద్, తిప్పేస్వామి, మంజు, పరమేశ్వరప్ప, మర్రిస్వామి, అంజి, రామాంజి, బొజ్జన్న, శరణప్ప పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి మళ్లీ వెలుగులు: ఉమా

కళ్యాణదుర్గం, జనవరి 6: వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ అంధకారంలోకి వెళ్లిందని, రాష్ట్రానికి మళ్లీ వెలుగులు చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు పేర్కొన్నారు. కంబదూరు మండలంలోని వెంకటంపల్లిలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

రా.. కదలిరా.. సభలతో వైసీపీ ప్రభుత్వంలో వణుకు

తెలుగుదేశం పార్టీ చేపట్టిన రా కదలిరా సభలకు ప్రజలు నీరాజనం పడుతుండటంతో వైసీపీ ప్రభుత్వంలో వణుకు పుట్టిందని ఉమామహేశ్వరనాయుడు పేర్కొన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయహో బీసీ పేరుతో తెలుగుదేశం పార్టీ ప్రతి పార్లమెంటు, మండల స్థాయి, గ్రామస్థాయిలో ప్రజల్లోకి వెళ్తోందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అన్ని విధాలుగా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బీసీ సబ్ ప్లాన్ కింద టీడీపీ ప్రభుత్వంలో రూ.74 వేల కోట్లు రుణాలు అందించి ఆర్థికంగా బలోపేతం చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం రూ. 132 కోట్లు నిధులు కేటాయించి బీసీలపై కపట ప్రేమ చూపిందనీ మండిపడ్డారు. జగన్మోహన్‌రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత వుండటంతో దాన్ని ఎమ్మెల్యేలపై నెట్టి బదిలీలు చేసే ప్రక్రియలో తలమునకలు అయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గల్లంతు చేయడానికి రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దొడఘట్ట నారాయణ, తలారి సత్తి, కొల్లప్ప, రామరాజు, బిక్కి గోవిందరాజులు, కామక్కపల్లి నాగరాజు, విరుపాక్షి, డీలర్ శీన పాల్గొన్నారు.

ఇంటి పట్టాల కోసం ఆందోళన

బెళుగుప్ప, జనవరి 6: జగనన్న లేఔట్‌లో ఇంటి పట్టాలిచ్చి స్థలాలు చూపాలని మండల కేంద్రానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సమస్య పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి కదలమంటూ భైఠాయించారు. కాలనీవాసులు మాట్లాడుతూ అర్హులైన వారెందరో స్థలాలు లేక ఇరుకు గదుల్లోనే ఉంటూ ఇబ్బంది పడుతున్నామని నిలదీశారు. ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు ఉంటూ అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వైసీపీ నాయకులు కొందరు గుట్టుగా పట్టాలు పొంది కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాలనీలో 80 మందికి పైగా ఇళ్ల స్థలాలు లేకుండా వున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నాలుగేళ్లుగా తిరుగుతున్నా స్పందించడం లేదని టీడీపీ నాయకులు పెద్దతిప్పయ్య, మల్లికార్జున, విజ్జి, రాములు అధికారులతో వాగ్వాదానికి దిగి ఎస్సీలకు మద్దతు తెలిపారు. ఒకే ఇంట్లో 18 మంది వుంటున్నామని, కాలనీకి చెందిన ఈశ్వరమ్మ, మరో మహిళ చిట్టెమ్మ ఇంట్లో 12 మంది నివాసముంటున్నామని ఎలా కాలం గడపాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ఓబుళేసు మాట్లాడుతూ విచారించి అర్హులందరికీ పట్టాలిచ్చి న్యాయం చేస్తామనడంతో శాంతించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గడ్డం వన్నూరుస్వామి, నారాయణ స్వామి, శ్రీరాములు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

అన్న క్యాంటిన్ @ 250 రోజులు

గుంతకల్లుటౌన్, జనవరి 6: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ అన్నక్యాంటీన్ ప్రారంభించి శనివారానికి 250 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చాలన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితో నారాలోకేశ్ మార్గదర్శకత్వంలో పట్టణంలో ఐదు 5రూపాయలకే రుచికరమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మాజీ ఎంపీపీ నాగభూషణం, రామరాజుయాదవ్, కేఎల్‌శ్రీనివాసులు, సంగాల రాము, అశోక్, లేపాక్షి, మహేశ్వర్‌రెడ్డి, రామాంజినేయులు, వాల్మీకి సుధాకర్, అశోక్ పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న వెంకటశివుడు యాదవ్

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


టీడీపీలోకి చేరిన సొల్లాపురం గ్రామస్థులు

కణేకల్లు, జనవరి 6: మండలంలోని సొల్లాపురం గ్రామంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఎంపీటీసీ కేశవరెడ్డి, పార్టీ ప్రధాన నాయకుడు రవీంద్ర, మల్లికార్జునరెడ్డి, విశ్వనాథరెడ్డి, కేశవరెడ్డి, తిమ్మారెడ్డి, సాగర్‌రెడ్డి, తిప్పయ్య, రామాంజనేయులు, బాబు, హుస్సేనప్ప, ఉలిగప్ప, ఎర్రిస్వామి, మాణిక్య, మధు, గురుస్వామితో పాటు దాదాపు 50 కుటుంబాలు వైసీపీని వదిలి టీడీపీలోకి వచ్చారు. శనివారం మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరడంతో టీడీపీలో నూతన జోష్ ప్రారంభమైంది. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్లు లాలెప్ప, ఉండాల హనుమంతరెడ్డి, ఆనంద్‌రాజు, కోశెకుర్తి సుదర్శన్, సొల్లాపురం నాయకులు శేషప్ప, హనుమాపురం ఎంపీటీసీ నరేంద్ర, మాల్యం కిష్టప్ప, షాషావలి, సత్తార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటించిన జేసీ అశ్మిత్‌రెడ్డి


మహిళలతో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి6: మండలంలోని కొండేపల్లి, వంగనూరు గ్రామాల్లో శనివారం టీడీపీ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించా రు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించా రు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక నేతలను కలుసుకొని రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

తాడిపత్రి, జనవరి6: పట్టణంలోని గర్ల్స్‌హైస్కూల్ వద్ద ఈనెల 3న జరిగిన హత్యకేసులో ఎనిమిది మంది నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ గంగయ్య తెలిపారు. వారినుంచి నాలుగు వేటకొడవళ్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయన తెలిపిన మేరకు 2022 ఆగస్టునెలలో రహంతుల్లా, సయ్యద్ అరిఫ్‌ల మధ్య శత్రుత్వం ఏర్పడిందన్నారు. ఈ కారణంగా సయ్యద్ అరిఫ్ అతని స్నేహితులు కలిసి ఆసుపత్రిపాలెంలో నిద్రిస్తున్న రహంతుల్లా నానమ్మ, మేనత్తలపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారన్నారు. ఈ హత్యకు ప్రతీకారంగా అరిఫ్‌ను హత్యచేసేందుకు సమయం కోసం వేచి ఉన్నారన్నారు. గర్ల్స్‌హైస్కూల్ వద్ద వెళుతున్న అరిఫ్‌ను రహంతుల్లా, అయూబ్, తౌఫిక్‌లతోపాటు మరికొందరు కలిసి వేటకొడవళ్లతో నరికి హత్య చేశారన్నారు. హత్యకేసులో నిందితులను పట్టుకోవడానిక ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, ఇన్‌చార్జ్ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పాటు చేశామన్నారు. అందిన సమాచారం మేరకు రహంతుల్లా, అయూబ్, సాదిక్ వలి, తోళ్ల మాబు, షబ్బీర్, కలాం బాషా, హాజీబాషా, మహమ్మద్‌లను అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో ఖాదర్‌బాషాతోపాటు మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వారికోసం గాలింపు చేపట్టామని డీఎస్పీ తెలిపారు.

టీడీపీలోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి

పామిడి, జనవరి 6: తెలుగుదేశం పార్టీతోనే ముస్లిం మైనార్టీలు అభివృద్ధి చెందారని గుంతకల్లు మాజీ శాసనసభ్యులు జితేంద్ర గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి స్వగృహంలో శనివారం రాత్రి ముస్లిం మైనార్టీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేసిందన్నారు. శాసనమండలి చైర్మన్‌గా షరీఫ్‌ను నియమించిందన్నారు. శాసనమండలిని రద్దు చేసేందుకు వైసీపీ ప్రభుత్వం కుట్రలు పన్నినా చైర్మన్ షరీఫ్ అడ్డుకోవడం అభినందనీయమన్నారు. ఈనెల 8న గుంతకల్లు పట్టణంలో జరిగే ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంకు ముస్లిం మైనార్టీలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్ చౌదరి, గౌస్ పీరా, చెన్నవరం మహబూబ్‌బాషా, మహమ్మద్‌రఫీ, కొట్టం మాలిక్ బాషా, శివశంకర్, రహీం, ధనుంజయ, రామకృష్ణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జితేంద్రగౌడ్

టీడీపీతోనే గ్రామ స్వరాజ్యం

డీ.హీరేహాళ్, జనవరి 6: టీడీపీతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు అన్నారు. మండలంలోని కురుబ కాలనీలో శనివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుష్పావతి నాగళ్లి, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, మాజీ కన్వీనర్ మాకాసి వెంకటేశు, వన్నూరుస్వామి, నల్లయ్య, దేవా, విజయ్, మోహన్ పాల్గొన్నారు.


కురుబకాలనీలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

జేసీపీఆర్‌ని కలిసిన తులసిరెడ్డి

తాడిపత్రి, జనవరి 6: స్థానిక నివాసంలో శనివారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి కలిశారు. గంటపాటు స్థానిక, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను మాట్లాడుకున్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డితో తో ఉన్న సన్నిహిత సంబంధాల వల్లే కలిసినట్లు తెలిపారు. అంతకుమునుపు విలేకరులతో తులసిరెడ్డి మాట్లాడుతూ రాబోయే కాలంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. 10సంవత్సరాల అరణ్యవాసం ముగించుకొని తెలంగాణాలో అధికారంలోకి వచ్చామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఏపీలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు.


ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న తులసిరెడ్డి

చింతలాయపల్లిలో గడ్డివాములు దగ్ధం

యాడికి, జనవరి6: మండలంలోని చింతలాయపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో శనివారం తెల్లవారుజామున గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన పుల్లారెడ్డి, లక్ష్మయ్య, ప్రసాద్‌లు పాడి పశువుల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. బాధిత రైతులు తెలిపిన మేరకు పశువుల మేత కోసం ఇటీవల పశుగ్రాసం కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాములకు నిప్పుపెట్టి వెళ్లారన్నారు. సమాచారం అందుకున్న స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రదేశానికి వెళ్లి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. ఈ సంఘటనలో సుమారు రూ.2.50లక్షల విలువగల గడ్డివాములు దగ్ధమైనట్లు బాధితులు వాపోయారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.


తాడిపత్రిలో ర్యాలీగా వస్తున్న కార్మికులు


గుంతకల్లులో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న జగదీష్ తదితరులు


గుత్తిలో మున్సిపల్ కార్యాలయం గేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు


కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

మున్సిపల్ కార్మికుల వంట వార్పు

గుంతకల్లు టౌన్, జనవరి 6: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుధ్యం, ఇంజనీరింగ్ కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. కార్మికులు వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు సమ్మెకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సంఘీభావం తెలిపారు. కార్మికులకు భోజనం వడ్డించారు. కార్మికులతో పాటు కలసి కమిషనర్ భోజనం చేశారు. అలాగే పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ పారిశుధ్యకార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారం 4వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్ సంఘీభావం తెలిపారు.

● అలాగే గుత్తి, కళ్యాణదుర్గంలలో కార్మికులు నిరసన తెలిపారు. తాడిపత్రిలో గంపలతో వెంట తెచ్చుకున్న చెత్తతోపాటు కోళ్ల వ్యర్థాలను మున్సిపల్ కార్యాలయం లోపలికి చల్లి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.


గుంతకల్లులో మున్సిపల్ కార్మికులతో కలిసి భోజనం చేస్తున్న మున్సిపల్ కమిషనర్


తాడిపత్రిలో చెత్తాచెదారాన్ని కార్యాలయం లోపల చల్లుతున్న కార్మికులు